# తోడుదొంగలు

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

సుజాత సుతరాం వప్పుకోలేదు. నారాయణ నాకు వద్దంటె నాకు వద్దని కూర్చున్నాడు.

'పురిటిగదిలోనే మూడుముళ్లు వేసే మహాపురుషులుమీరు. నా అదృష్టంకొద్దీ, యీ వయస్సొచ్చేంతవరకైనా ఆగారు. లేకపోతే యెప్పుడో మెడకు కట్టేసివుంటే నా జీవితాంతం మీ జీవానపడి యేడవాలసి వచ్చేది' అంటూ చీదరించుకున్నాడు నారాయణ.

'మేనత్తకు వకకొడుకుండగానే మొగుడయి కూర్చుంటాడేమిటి నాకు అర్థంకాక అడుగుతాను. మీదంతా చాదస్తంకాని ఆ రోజుకు యెవరో వకరు వస్తార్లే' అంటూ సుజాత నిష్పూచీగానొక్కి వక్కాణించింది.

సుజాత తల్లి, యెట్లాజరగాలసివుంటే అట్లాగే జరుగుతుందిలే అని, నారాయణ తల్లి రాసిపెట్టుంటే తప్పుతుందా అని యిద్దరు అద్వైతంలోకిదిగి కూర్చున్నారు.

"ఈ యింటివాణ్ణి చెయ్యటంతోనే వచ్చింది కొంపకు అనర్థకం. 'తాదూర సందులేదుకాని మెడకోడోలు' అన్నాడట! అట్లావుంది మీ పద్ధతి. 'నేను యిప్పుడప్పుడే పెళ్లిచేసుకోనని చెప్పలా యెన్నిసార్లు' అంటూ కసురుకున్నాడు నారాయణ.

'ఈ చదువు సంగతేమిటో తేల్చుకునేదాక, నాకా వివాహ విషయం చెప్పకండి. మెత్తనివాళ్లనుచూస్తే మొత్తబుద్ధవుతుందని, వూరుకుంటుంటే, మహా రెచ్చిపోతున్నారు' అంటూ నిష్కర్షగా చెప్పేసింది సుజాత.

వీళ్లిద్దరు యింత నిష్పూచీగా నిర్భయంగా చెప్పేస్తుంటే తల్లి తండ్రులు మాత్రం యేం చేస్తారు!

'ఇది చివరిసారి చెప్పటం. నేను యిప్పుడప్పుడే పెళ్లిచేసుకోను' తల్లినోటివెంబడి మాట సాంతం వినకమునుపే 'అదే చెపుతున్నాగా ఇంకా అయిదేళ్లదాక' ఇకనువ్వేమనుకున్నా సరే' అన్నది సుజాత తల్లితో అతిధైర్యంగా.

'కన్నకొడుకు కష్టపెట్టాడంటే లాభం లేదు. నువ్వూ ఆలోచించాలి. ఈ వివాహ విషయంలోమాత్రం యెవ్వరి జోక్యం నేను సహించను. తర్వాత యెవరెట్లా అనుకున్నా సరే' అన్నాడు నారాయణ కనుబొమ్మలు ముడేస్తూ.

'ఆడింది ఆట పాడిందిపాటగావుంది దానిపని. అదంతా తండ్రిచనువే. అయిదేళ్ల తర్వాత చేసుకుంటుందిట' అన్నది సుజాత తల్లి, వదినగారితో అతి వుక్రోషంగా.

‘మానారాయణ అసలు ఆ మాట అంటేనే మండిపడుతున్నాడు. తన మంచికి చెప్పినా తెలుసుకోకపోతే యెవరేమి చేస్తారు. పెట్టుకున్నకొద్దీ బాధేతప్ప యింకేంలేదు’ అంది నారాయణ తల్లి సమాధానంగా.

ఇక ఆ ప్రస్థావనే రావటంలేదు యిళ్లల్లో. వకనెల గడిచిందేమో అంతే.

‘అమ్మా! ఎందుకే నామీద అంత కోపం, ఎట్లాగో వుంటున్నావు’ అన్నది సుజాత తల్లి దగ్గరకువస్తూ.

‘కూతురిమీద కోపం వుంటుందేమిటే యేతల్లికైనా నువ్వు కాబట్టి నిప్పచీగా చెప్పేశావుకాని’ అన్నది సుజాత తల్లి.

సుజాత ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ‘ఎందుకొచ్చిన గొడవే యిదంతా. అంతా నీ యిష్టము’ అంటూ గబగబ గదిలోకి వెళ్లిపోయింది.

‘అమ్మా! నేను అదివరకు యేమన్నానో అన్నాను. నీ యిష్ట ప్రకారమేకాని. ఇంతకీ పెళ్ళిచేసుకోమంటావు అంతేగా’ అన్నాడు నారాయణ తలవంచేసుకుని.

‘అంతకంటె నేననమన్నానురా నాయనా’ అంది నారాయణ తల్లి పట్టరాని సంతోషంతో.

‘ఏవమ్మాయి వదినా, మా అబ్బాయికి యేంబుద్ధి పుట్టిందో వాడు వప్పుకున్నాడమ్మా’ అన్నది నారాయణ తల్లి.

‘సరే నేనూ - ఆ శుభవార్త చెప్పటానికే ప్రయాణమయ్యాను. నాలుగు రోజులనుంచి యింట్లో అదో విధంగా వుంటూ వచ్చింది. అసలు విషయం కాస్తా నిన్న బయట పెట్టేసింది. ఇక వియ్యాపురాళ్ల మమ్మాయి’ అన్నది సుజాత తల్లి.

ముసిముసి నవ్వులు యిద్దరి ముఖాల మీద నాట్యమాడినాయి.

‘ఏమిటే హడావిడి ... నిన్నే ... మాట్లాడవే’ ...

‘వూరుకోవమ్మా మధ్య నీ గొడవొకటి అంతా మోసం ... దగా ... పైగా పెళ్లికి రమ్మని శుభలేఖకూడా .... సిగ్గుండాలి .... ఎంత మగవాడైనా ... ’

‘ఏమిటే అమ్మాయి నాతో చెప్పవే...’

‘ఏమిటి చెప్పేది ... ఈ మహేంద్రున్నే నేను పెళ్లి .... ’

‘ఏమిటీ మహేంద్రున్నే పెళ్లిచేసుకుంటానని చెప్పింది, అదా విషయం. ఇంత మార్పు యెట్లా వచ్చిందా అని అప్పుడే అనుకున్నానుసుమా! నేను యింకా బావను చేసుకోవటానికే వప్పుకున్నావనుకున్నా .... ’ అన్నది సుజాత తల్లి ముక్కుమీద వేలు వేసుకుని.

'ఆ.... బావను చేసుకోవాల్సిందే! .... వకమగవాన్ని యెంతమంది చేసుకుంటా రేమిటి?'

'ఏమిటే ఆ మాటలు ...

'ఏమిట్రా హడావడి ... నిన్నే .... మాట్లాడవే'

'వూరుకోవమ్మా మధ్య నీ గొడవ వొకటి ... అంతా మోసం ... దగా.... పైగా పెళ్లికి రమ్మని శుభలేఖకూడా ... సిగ్గుండాలి ... అందులో ఆడజన్మ ...

'ఏమిట్రా అబ్బాయి నాతో చెప్పరా ...'

'ఏమిటి చెప్పేది .... ఈ మాలతినే నేను పెళ్లి ....'

'ఏమిటీ మాలతినా పెళ్లిచేసుకుంటానని చెప్పింది. అదా విషయం. ఇంతమార్పు యెట్లా వచ్చిందా అని అప్పుడే అనుకున్నా సుమా!

నేను యింకా సుజాతను చేసుకోవటానికే వప్పుకున్నావనుకున్నా..' అన్నది నారాయణతల్లి, ముక్కుమీద వేలు వేసుకుని.

'ఆ...సుజాతను చేసుకోవాల్సిందే! ... వక ఆడదాన్ని యెంతమంది చేసుకుంటా రేమిటి?'

'ఏమిట్రా ఆ మాటలు ...'

'చూశావా వదిన. తెల్లవన్నీ పాలని నమ్మేవాళ్లం. మనకు యీ గొడవ అంతా యేం తెలుసు! వప్పుకుందంటే నిజమే అనుకున్నా. తీరా నిలవతీస్తే, మహేంద్రున్నిట! మహేంద్రుడు .... అవుతే నాకు తెలీక అడుగుతాను. మీ అబ్బాయికి సంబంధం అదివరకే కుదుర్చుకున్నారా యేమిటి' అన్నది సుజాత తల్లి, కొంచెం జంకుతూనే.

'చాల్లే వదిన నీ భాష్యంమాటలు. అమ్మాయికి సంబంధం కుదుర్చుకుని నా దగ్గరకు రాకపోతే, యిష్టంలేదనిచెపితే యెవరు కొట్టారు. ఏదో గంతకుతగ్గ బొంత అని, మావాడికి తగ్గది మావాడికి దొరక్కపోతుందా! ఈనాటకం అంతా యెందుకంట! పైగా మా వాడికి సొద్దులు చెతుతున్నావు యెదురు?' అన్నది నారాయణ తల్లి, ముఖం చిట చిట లాడించుకుంటూ

ఏమిటమ్మా నువ్వనేది నాకేమి తెలుస్తున్నట్టటంలేదు' అన్న సుజాతతల్లి పూర్తిగా అమాయకంగా.

సుజాత చిటచిటలాడిపోతోంది. నారాయణ మటమటలాడిపోతున్నాడు. సుజాత కోరచూపులతో చకచక నడిచింది పెళ్లి పందిర్లోకి. నారాయణ ఓరచూపులతో పొంకి పొంకి వస్తున్నాడు. వధూవరుల్ని చూసేటప్పటికి యిద్దరు గభాలున వులిక్కిపడ్డారు.

'బావా! నువ్వా! ...' అన్నది అతి ఆశ్చర్యంగా కళ్లు పెద్దవిచేస్తూ సుజాత.

'ఆ ... నేనే! .... మహేంద్రున్ని పెళ్లయింది చూశావుగా. ఏమంటావు?' అన్నాడు నారాయణ చిరునవ్వు పెదిమల మీదికి రానిస్తూ.

'మాలతి పెళ్లి అయింది ... నువ్వేమంటావు' అన్నది సుజాత చిరునవ్వు పెదిమలపైకి రానిస్తూ.

